TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

**మంచిమాట**

ప్రేమ ఉంటే మౌనం కూడా అర్థమవుతుంది. అది లేకపోతే ప్రతి మాటా అపార్థమే అవుతుంది.

మల్కాజిగిరి | సంపుటి : 01 సంచిక : 05 | గురువారం, ఫిబ్రవరి 05, 2026 , | పేజీలు - 08 | వెల : 4/-

# తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన జయశంకర్ జాతిపిత


- మిర్యాలగూడ ప్రజాపాలన
- ప్రజా విజయోత్సవ సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- హాజరైనమంత్రులుఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్



**మిర్యాలగూడ:** గత ప్రభుత్వంలో భార్యాభర్తలు ఫోన్‌లో మాట్లాడుకుంటే ట్యాప్ చేసి విన్నారని, అలా చేయడం దుర్మార్గమని, చివరికి జడ్జిలు, ప్రతిపక్ష నేతలు, సినీతారలను కూడా వదల్లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్?కు సిట్ నోటీసులిస్తే జాతిపితకు నోటీసు ఇస్తారా అని ఎదురు దాడికి దిగుతున్నారని మండిప డ్డారు. మీ జాతికి పిత కావచ్చున్న ఆయన మీతో ప్రజలకు ఏం పని అని విమర్శించారు. హరీశ్‌రావు, ఎర్రబెల్లి, కృష్ణారావు వంటి నేతలు మీ జాతి కావచ్చుని నిప్పులు చెరిగారు. ఘోర నేరాలు చేస్తే పోలీసులు ముసుగు తొడిగి పట్టుకుని వస్తారని, హరీశ్‌రావు, కేటీఆర్‌లను అలాగే పట్టుకుని రావాల్సిందన్నారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిందన్న రేవంత్ రెడ్డి 7 కార్పొరేషన్లు, 116 మున్సి పాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రె స్‌కు ఎదురే లేదని తమ విజ యాన్ని అడ్డుకోలేరని చెప్పారు. అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్లపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదన్న ఆయన రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందు వరుసలో ఉందన్నారు.

## ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్ కొట్టివేత


- ఆధారాలు చూపలేకపోయారన్న స్పీకర్



**జగిత్యాల :** జగిత్యాల శాసనసభ్యుడు సంజయ్‌కు ఊరట లభించింది. ఆయనపై దాఖలైన అనర్హత పిటిషన్ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కొట్టేశారు. సంజయ్?పై అనర్హత కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. దానిని కొట్టేస్తూ స్పీకర్ తీర్పును వెలువరించారు. పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని సభాపతి పేర్కొన్నారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పును వెలువరించారు. సంజయ్‌కుమార్‌తో కలిపి ఇప్పటివరకు 8 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లు కొట్టివేశారు.నేను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే : తనపై బీఆర్ఎస్ నాయకులు దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై స్పీకర్ తీర్పు వెలువరించిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. తాను బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని ఆయన స్పష్టం చేశారు. నెలకు రూ.5వేలు ఆ పార్టీకి కట్ అవుతున్నట్లుగా తెలిపారు. బీఆర్ఎస్ అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్? తెలిపారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ బిల్లులు పెట్టి, విప్ జారీ చేస్తే మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని వివరించారు. జగిత్యాలకు నిధుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని తెలిపారు. సీఎం కలిసి కండువా కప్పగానే తన ఆస్పత్రిపై బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశాయన్నారు. వివరణ చెప్పుకునేందుకు బీఆర్ఎస్ నాయకత్వం తనకు చిన్న అవకాశం కూడా ఇవ్వలేదన్నారు.


## మున్సిపల్ ప్రచారానికి పవన్ కల్యాణ్

### - బీజేపీకి మద్దతు ప్రకటించిన జనసేనాని



**హైదరాబాద్ :**తెలంగాణ పురపాలక ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్? కల్యాణ్ ప్రచారం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 7,9 తేదీల్లో బీజేపీ అభ్యర్థుల తరఫున మున్సిపాలిటీల్లో ప్రచారం చేసేందుకు ఆయన తెలంగాణ రానున్నారు. ఈ విషయాన్ని జనసేన కేంద్ర కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన రూట్?మ్యాప్?ను త్వరలో ప్రకటించనున్నారుపవన్? కల్యాణ్?తో తెలంగాణ బీజేపీ నేతల భేటీ : తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈసారి అత్యధిక స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలను రచిస్తోంది. ఓవైపు పార్టీ శ్రేణులందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తూ మరోవైపు ప్రముఖులతో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్? కల్యాణ్?ను తెలంగాణ బీజేపీ నేతలు కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా వారి మధ్య పలు అంశాలు చర్చకు వచ్చినట్లుగా తెలిసింది.పురపాలక ఎన్నికల్లో బీజేపీకి పవన్? కల్యాణ్ మద్దతు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్? రావులు మంగళవారం ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్? కల్యాణ్?తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లుగా ఆ పార్టీ నేతలు వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తరఫున బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లుగా పవన్ స్పష్టం చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఏపీలో కూటమి ధర్మాన్ని ఏవిధంగానైతే పాటిస్తున్నారో ఇక్కడ కూడా అదే స్ఫూర్తితో బీజేపీ విజయానికి జనసేన సైనికులు కృషి చేస్తారని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు రాష్ట్రంలో పర్యటించేందుకు, బహిరంగ సభల్లో పాల్గొనేందుకు పవన్ సానుకూలంగా స్పందించారని రామచందర్ రావు వెల్లడించారు.లేఖ విడుదల చేసిన జనసేన పార్టీ : మరోవైపు బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు జనసేన కేంద్రకార్యాలయం కూడా ఓ లేఖను విడుదల చేసింది. తెలంగాణలో జరగబోయే పురపాలక ఎన్నికల ప్రచారంలో జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్? పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లుగా అందులో పేర్కొంది. ఫిబ్రవరి 7,8 తేదీల్లో పలు మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. అయితే పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఇంకా విడుదల కావాల్సి ఉంది. సినీనటుడిగా, రాజకీయనేతగా పవన్‌కు ఉన్న చరిష్మాను బీజేపీ ఉపయోగించుకోవాలని భావిస్తోంది ఈ నేపథ్యంలోనే పురపాలక ఎన్నికల్లో ఆయనతో ప్రచారం చేయించాలని నిర్ణయించినట్లుగా తెలిసింది.

## జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఆన్సర్ కీ విడుదల




**న్యూఢిల్లీ4:** జేఈఈ మెయిన్స్-2026 సెషన్-1 పరీక్షకు సంబంధించిన ఆన్సర్ కీని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధ,వారం విడుదల చేసింది. డైరెక్ట్‌గా జేఈఈ మెయిన్స్ ఆన్సర్ కీ ద్వారా ఈ విండో నేటి నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరించింది. ఫిబ్రవరి 6వ తేదీన ఈ విండో క్లోజ్ అవుతుందని అభ్యర్థులకు స్పష్టం చేసింది. అనంతరం ఈ విండో 2 నుంచి 3 రోజులు తెరిచి ఉంటుందని వివరించింది. ఈ సమయంలో అభ్యర్థులు తాత్కాలిక సమాధాన కీని సవాల్ చేసుకోవచ్చుని.. అందుకు ప్రతి ప్రశ్నకు రూ.200 చెల్లించాలని అది కూడా ఆన్‌లైన్‌లోనే చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సబ్జెక్ట్ నిపుణులు అన్ని ప్రశ్నలను పరిశీలించి.. తుది సమాధానానికి సంబంధించిన కీని ప్రకటిస్తారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పేర్కొంది.


## క్యాన్సర్ మరణశాసనం కాదు శరీరం చెప్పే మాట వినాలి

- కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం
- వయసుతో సంబంధం లేకుండా క్యాన్సర్ వ్యాధులు
- ముందస్తు గుర్తింపుతోనే నివారణ సాధ్యం
- కిమ్స్ ఆసుపత్రి కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి




**సికింద్రాబాద్ :** క్యాన్సర్ వ్యాధి అనేది దేవుడు ఇచ్చిన శాపం కాదు. అది మన జీవన విధానంలో మనతోనే మొదలువుతుందన్నారు" పద్మవిభూషన్, మెగాస్టార్ చిరంజీవి. బుధవారం కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలన్నారు. ముందస్తు జాగ్రత్త అవసరం : క్యాన్సర్ అనగానే జీవితం ముగిసినట్లే అంతా అనుకుంటున్నారని, కానీ ఇక్కడ ఇంత మంది క్యాన్సర్ వ్యాధిని జయించిన వారిని చూస్తుంటే డాక్టర్లు ఎంతో కష్టపడుతున్నారో అర్థమవుతుందని చిరంజీవి అన్నారు. క్యాన్సర్ అనేది మనకు మరణశాసనం కాదు ముందస్తుగా గుర్తిస్తే క్యాన్సర్?ని కూడా జయించి సాధారణ జీవితాన్ని అస్వాదించవచ్చన్నారు. ఇక్కడ ఎంతో మంది చిన్నారులను కూడా చూస్తున్నామని వారి కూడా క్యాన్సర్ బారిన పడ్డారంటే ఎంతో బాధగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ కూడా ఈ వ్యాధిపై అవగాహన పెంచుకొని, ఆయా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులు సంప్రదించాలని చిరంజీవి సూచించారు."గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. అప్పుడే వైద్యులు దాన్ని నివారించగలిగారు. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలి"

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్



**న్యూఢిల్లీ:** మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగగమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్న ట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేరొ ్కన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు.జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు.

## మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 04:** తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు నితిన్ నబీన్.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగా నికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజు లు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు.అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

## ఉగాది రోజున ఘనంగా గద్దర్ అవార్డుల పంపిణీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. (బుధవారం) సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు.కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు.

# మేయర్ సమక్షంలో రచ్చ రచ్చ: రామచంద్రపురంలో 'షాడో కార్పొరేటర్' పెత్తనంపై గ్రామస్తుల ఆగ్రహం!





**రామచంద్రపురం, ఫిబ్రవరి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రపురం (112 డివిజన్) పరిధిలోని మందుమూల గ్రామంలో బుధవారం హైడ్రామా చోటుచేసుకుంది. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మేయర్ గద్వాల విజయలక్ష్మి సమక్షంలోనే కాంగ్రెస్ - బీజేపీ వర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరగడంతో వాతావరణం రసాభాసగా మారింది. కుల సంఘ భవనం నిర్మాణం చుట్టూ తిరుగుతున్న ఈ వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుని స్థానికంగా పెను సంచలనంగా మారింది.

వివాదానికి మూలం: గ్రామకంఠం భూమిలో అక్రమ నిర్మాణం?
మందుమూల గ్రామస్తుల ఆరోపణల ప్రకారం.. గతంలో గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం ఆసుపత్రి లేదా ప్రజా ప్రయోజనార్థం (కమ్యూనిటీ సెంటర్) కేటాయించిన 'గ్రామకంఠం' స్థలాన్ని, ఒక కుల సంఘ భవనం కోసం అక్రమంగా వాడుకుంటున్నారు. హనుమాన్ దేవాలయానికి ఆనుకుని ఉన్న ఈ ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టడాన్ని బీజేపీ నాయకులు మరియు గ్రామస్తులలోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనిపై మేయర్‌కు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది

షాడో కార్పొరేటర్' నగేష్ యాదవ్‌పై తీవ్ర విమర్శలు
ఈ వివాదం వెనుక పుష్ప నగేష్ (షాడో కార్పొరేటర్) ఉన్నారని గ్రామస్తులు ఘాటుగా విమర్శించారు. ఆయన తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొన్ని కీలక అంశాలను లేవనెత్తారు:

నిధుల మళ్లింపు: గుడి అభివృద్ధి కోసం కోటి రూపాయల సొంత నిధులు ఖర్చు చేశానని చెప్పుకుంటున్న నగేష్, వాస్తవానికి జిహెచ్ఎంసి నుండి రూ. 27.33 లక్షల టెండర్లు ఎలా వేశారని ప్రశ్నించారు.స్వయం ప్రకటిత ధర్మకర్త: గుడికి తనకు తానుగా 'శాశ్వత ధర్మకర్త'గా ప్రకటించుకోవడంపై గ్రామస్తులు ఎద్దేవా చేశారు. అందరి ఓట్లతో గెలిచి కేవలం ఒకే వర్గానికి కొమ్ముకాయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు.

"మా ఊరికి పట్టిన దరిద్రం సత్యనారాయణ"
గుడి కమిటీ వ్యవహారాలపై గ్రామస్తులు కరికే సత్యనారాయణను లక్ష్యంగా చేసుకున్నారు.గుడి లెక్కలు అడిగితే తాను ఖర్చు చేసిన 38 లక్షలు తిరిగి ఇస్తేనే లెక్కలు చెబుతాననడం సిగ్గుచేటు. లక్షల రూపాయల విరాళాలు ఇచ్చిన దాతలకు కనీస గౌరవం కూడా దక్కడం లేదు. ఇతని వల్ల గ్రామానికి పట్టిన దరిద్రం వదిలించుకోవాలి" అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.రామచంద్రపురం గ్రామస్తుల డిమాండ్‌మేయర్ వెళ్ళిపోయిన అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో రామచంద్రపురం గ్రామస్తులు నార్సింగ్ గౌడ్, నాగులు సేటు మరియు స్థానికులు మాట్లాడుతూ.. గతంలో ఈ స్థలం ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించినట్లు ఆధారాలు (లే అవుట్ కాపీలు) చూపించారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని, ఆ స్థలాన్ని ప్రజలందరికీ ఉపయోగపడేలా ప్రభుత్వ భవనాల కోసం వాడాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన యువ నాయకుడు సంద్రుగు శ్రీకాంత్



**చేగుంట ఫిబ్రవరి 4 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం చిన్న శివునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోనాల నవీన్ గారి అమ్మ మరణించిన విషయం తెలిసి సంద్రుగు శ్రీకాంత్ ,దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం మరియు 50 కేజీల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాప్ గౌడ్, ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలోపేతం -- మధారం గ్రామంలో సమావేశం, గడ్డపోతారం గుమ్మడిదల మున్సిపాలిటీల్లో భారీ చేరికలు






**పటాన్ చెరు ఫిబ్రవరి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని గడ్డపోతారం మరియు గుమ్మడిదల మున్సిపాలిటీ లలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఘన విజయం దిశగా తీసుకెళ్లేందుకు వార్డు స్థాయిలో బలోపేతం, ఇంటింటి ప్రచారం, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపాలిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గారు, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి గారు, గుమ్మడిదళ మున్సిపాలిటీ ఇంచార్జ్ పట్నం మాణిక్యం . ఈ సమావేశం లో మధారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, రైతు ప్రయోజనాలకు బీఆర్ఎస్ పాలనలో జరిగిన సేవలను గుర్తించి పార్టీకి మద్దతుగా నిలిచామని వారు తెలిపారు.తదనంతరం గడ్డపోతారం మున్సిపాలిటీతో పాటు గుమ్మడిదళ మున్సిపాలిటీ పరిధిలో కూడా మాజీ మంత్రి హరీష్ రావు సమక్షంలో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హరీష్ రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని, తెలంగాణ అభివృద్ధికి కేసీఆర్ గారి నాయకత్వమే భరోసా అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, రైతులకు వ్యవసాయ కాలం దాటిపోయినా ఇప్పటికీ రైతుబంధు సకాలంలో ఇవ్వలేదని, అలాగే యువతకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు.వారి తో జిన్నారం మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుమ్మడిదళ ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి , రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య , గుమ్మడిదళ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి ,మాధారం మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి, మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి వార్డులో విజయం సాధించేందుకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఫార్మాస్యూటికల్ పరిశోధనలో డాక్టర్ ఆంజనేయులుకు పీహెచ్.డీ.



**పటాన్ చెరు ఫిబ్రవరి :04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి పాటంశెట్టి ఆంజనేయులును డాక్టరేట్ వరించింది. 'ఎంచుకున్న ఔషధాల (ఇరినోటెకాన్, సునిటినిబ్) మెరుగైన క్యాన్సర్ నిరోధక సామర్థ్యం కోసం అల్ట్రాసౌండ్-ఆధారిత నానోబబుల్ ఔషధ పంపిణీకి మార్గదర్శనం' అనే అంశంపై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.కొలొరెక్టర్ క్యాన్సర్ చికిత్సలో వైద్యపరంగా ఆమోదించబడిన క్యాన్సర్ నిరోధక మందులు, ఇరినోటెకాన్, సునిటినిబ్ ల చికిత్సా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి డెక్ట్రాన్-ఆధారిత, అల్ట్రాసౌండ్-ప్రతిస్పందించే నానోబబుల్లను అభివృద్ధి చేయడంపై డాక్టర్ ఆంజనేయులు పరిశోధన దృష్టి సారించినట్టు తెలియజేశారు. ఈ అధ్యయనం గణనీయంగా మెరుగైన ఔషధ విడుదల, జీవ లభ్యత, క్యాన్సర్ నిరోధక కార్యకలాపాలను, తగ్గిన దైహిక విషప్రక్రియను ప్రదర్శించిందన్నారు.ఈ పరిశోధన ఫలితాలు నానోబబుల్-సహాయ ఔషధ పంపిణీని లక్ష్య, ఉద్దీపనలకు ప్రతిస్పందించే క్యాన్సర్ చికిత్సకు ఒక ఆశాజనక వేదికగా నిర్ధారిస్తాయని, భవిష్యత్తులో క్లినికల్ అనువాదానికి బలమైన సామర్థ్యాన్ని అందిస్తాయని వివరించారు. డాక్టర్ ఆంజనేయులు సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది పలువురు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


# నిందితులకు చీరాల పోలీసులు స్పెషల్ ట్రీట్‌మెంట్




**బాపట్ల, ఫిబ్రవరి 04:** యువతలో నేర ప్రవృత్తి బాగా పెరుగుతోంది. దీనిని కట్టడి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. నేరానికి పాల్పడిన నిందితులను కిలోమీటర్ల మేర పట్టపగలు నడి రోడ్డుపై నడిపించి.. పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్తున్నారు. ఈ తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చీరాలలో యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు పాల్పడిన నిందితులకు పోలీసులు ఈ తరహా పద్ధతినే అమలు చేశారు. నేరాలకు పాల్పడే వారికి ఈ తరహా చర్యలు తప్పవంటూ నేర ప్రవృత్తి ఉన్నవారికి చెప్పకనే చెప్పారు పోలీసులు.ఇంతకీ ఏం జరిగిందంటే..జనవరి 27న చీరాల ఫ్లైఓవర్ వద్ద కొండే త్రినాథ్ (19) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని బీరు బాటిల్స్‌తో దారుణంగా పొడిచి.. బండరాయితో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతాల్లోని పలు సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.తమదైన శైలిలో వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఓ యవతితో ప్రేమ వ్యవహారంలో త్రినాథ్‌ను షేక్ గౌస్ హత్య చేశాడు. అతడికి దేవ హర్ష, శీలం భగవంతుడు సహాయం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించిందిబాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన కొండె వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులకు రెండో కుమారుడు త్రినాథ్ (19). అతడు తన అన్నతో కలిసి చీరాలలోని నానామ్మ ఇంటి వద్ద ఉంటూ.. రోజు వారీ విద్యుత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. త్రినాథ్, ఓ యువతి ప్రేమించుకుంటున్నారు. ఆ యువతిని త్రినాథ్ స్నేహితుడు షేక్ గౌస్ సైతం ప్రేమిస్తున్నాడు. దాంతో త్రినాథ్‌పై షేక్ గౌస్ కక్ష పెంచుకున్నాడు. దాంతో స్నేహితుల సహాయంతో త్రినాథ్‌ను గౌస్ దారుణంగా హత్య చేశాడని పోలీసుల విచారణలో తెలుస్తోంది.

# కాలనీ సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఆక్సిస్ పాప కాలనీలో కాట సునీత రాజేష్ గౌడ్ పర్యటన





**అమీన్‌పూర్ ఫిబ్రవరి: 04(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ పరిధిలోని ఆక్సిస్ పాప కాలనీ నివాసితులతో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కాట సునీత రాజేష్ గౌడ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కాలనీలో నెలకొన్న పలు సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు ఆమె ఈ పర్యటన చేపట్టారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఎద్దడి, వీధి దీపాలు మరియు అంతర్గత రహదారుల దుస్థితిని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల కష్టాలను సావధానంగా విన్న సునీత , సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ:ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు.కాలనీ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు. తన సమస్యలను విన్నవించుకునే అవకాశం కల్పించినందుకు కాలనీ వాసులు సునీత రాజేష్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# గాడితప్పుతున్న పార్లమెంట్ సమావేశాలు !



పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృథా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్దతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷–కే చెల్లింది. అమెరికా –భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్సోషల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే– వద్దని అడ్డం పడ్డాడి. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్‌ను పక్కన పెట్టింది. పాకిస్తాన్–ఇండియా యుద్దాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్‌పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా– భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక– తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్‌తో ఓ రకంగా కాల్బ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరు కున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మా ర్గం తప్ప మరోటి కాదు. పార్లమెంటులో సమస్యలపై చర్చిం చకుండా, జారుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

# ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

**ప్రచారంలో ముందున్న మంత్రి పొంగులేటి**

**విభేదాలు రాకుండా జగ్రత్త పడ్డ అమాత్యులు**





**ఖమ్మం,ఫిబ్రవరి4:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలలు తమ ప్రాంతాల్లో పట్టుకోసం యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రచారం ముందున్నారు. మున్సిపల్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. చివరి రోజు ఆయా పార్టీలు తమ క్యాండేట్లకు బీ ఫామ్స్ అందజేయగా, టికెట్ ఆశించి భంగపడిన పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారు రెబల్స్ గా మారి బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు ఆయా పార్టీల గుర్తులు ఇవ్వగా, ఇండిపెండెంట్లకు ఆఫీసర్లు గుర్తులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇక రాఝకీయాలు వేడెక్కాయి. మంత్రి పొంగులేటి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార ఉధృతి పెంచారు. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఒక్క చోట మాత్రమే వార్డు కౌన్సిలర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏదులాపురం 15వ వార్డులో సీపీఎం, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 106 డివిజన్లు, వార్డులకు 540 మంది బరిలో నిలిచారు. జిల్లాలోని మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 117 వార్డులకు 922 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూట్నీ తర్వాత 787 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని గుర్తించారు. మధిరలో 22 వార్డులకు 165 దాఖలు కాగా, గడువు ముగిసేసరికి 95 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 19 , బీఆర్ఎస్ తరపున17 , సీపీఎం 3, సీపీఐ 1, జనసేన 5, బీజేపీ 19, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులకు మొత్తం 130 మంది నామినేషన్ దాఖలు చేశారు. 58 మంది ఉపసంహరణ చేసుకోగా, 72 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 20, బీజేపీ 16, బీఎస్పీ 3, ఇండిపెండెంట్లు 13 మంది పోటీ చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 202 నామినేషన్లు వచ్చాయి. వాటిలో 15వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 31 వార్డుల్లో 108 మంది పోటీలో నిలిచారు.కాంగ్రెస్ తరపున 30 మంది, బీఆర్ఎస్ 23, సీపీఎం 7, బీజేపీ 24, సీపీఐ 11 వార్డుల్లో పోటీలో అభ్యర్థులను నిలిపాయి. 13 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. సత్తుపల్లిలో 23 వార్డుల్లో స్క్రూట్నీ తర్వాత 124 మంది పోటీలో నిలిచారు. వీరిలో 83 మంది బరిలో ఉండగా, 41 మంది విత్ డ్రా చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి 23, బీఆర్ఎస్ 22, బీజేపీ 22, జనసేన 4, సీపీఐ 2, సీపీఎం నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్లు 9 మంది పోటీలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో మొత్తం 155 మంది నామినేషన్లు వేశారు. వీటిలో 75 మంది విత్ డ్రా చేసుకోగా, 80 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గాలు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భట్టి వర్గంలో 12 మందికి బీ ఫామ్స్ దక్కగా, మంత్రి పొంగులేటి వర్గంలో ఐదుగురికి, ఎంపీ రేణుకాచౌదరి వర్గంలో ఒకరికి బీఫామ్ ఇచ్చారు. ఒక వార్డులో సీపీఐ అభ్యర్థికి, మరొక వార్డులో సీపీఎం అభ్యర్థికి మద్దతిస్తూ కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేయలేదు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 540 మంది బరిలో నిలిచారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు 78 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

# మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

- ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య
- యూపిలో ముగ్గరు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం



**లక్నో,ఫిబ్రవరి4:** ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గరు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గరు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గరు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గరూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గరూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷–లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గరిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷–లలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గరూ ప్రాణాలు కోల్పోయారు.

# పెళ్లి చేసుకునేందుకు – ఏది సరైన వయసు?

మీ అమ్మాయికి పెళ్లెప్పుడు? అబ్బాయికి సంబంధాలు చూస్తున్నారా? ఏరా, మంచి జాబ్ చేస్తున్నావ్, పప్పన్నం పెట్టడానికి ఆలస్యమెందుకు చేస్తున్నావ్? నేనిప్పుడే పెళ్లి చేసుకోను, కాస్త స్థిరపడ్డాక చూస్తా! సమాజంలో రోజూ వినిపించే ప్రశ్నలివి. మూడు పదుల వయసు వచ్చినా కూడా పెళ్లికి సిద్ధపడట్లేదు నేటితరం! జీవితంలో సెట్? అయిన తర్వాతే పెళ్లి అంటున్నారు నేటి పిల్లలు. ఏ వయసులో తీరాల్సిన ముచ్చట ఆ వయసులో తీరాలంటున్నారు పెద్దలు! మరి, వీరిద్దరిలో ఎవరు కరెక్టు? అసలు యువత పెళ్లికి ఎందుకు విముఖత చూపుతోంది? దీనివల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి? వంటి అంశాలను ఇక్కడ చూద్దాం.విముఖత ఎందుకు? :ఆర్థిక అస్థిరత : ప్రస్తుతం ఉద్యోగం దొరకడం మాత్రమే కాదు, దాన్ని నిలుపుకోవడమూ పెద్ద ఛాలెంజ్?గా మారింది. తక్కువ జీతాలు, పెరుగుతున్న జీవన





వ్యయాలు, ఈఎంఐలు ఇవన్నీ యువత భవిష్యత్తును అనిశ్చితికి గురిచేస్తున్నాయి. 'నా జీవితాన్నే గడపలేకపోతున్నాను, ఇంకొకరి బాధ్యత ఎలా తీసుకోగలను?' అనే భయం యువతలో పెరుగుతోంది.కెరీర్?కు ప్రాధాన్యం : చదువు, ఉద్యోగం, స్వీయ గుర్తింపుతో జీవితాన్ని నిర్మించుకోవాలంటున్నారు. వివాహం వల్ల కెరీర్ ఆగిపోతుందేమో, కుటుంబ బాధ్యతలు పెరిగి లక్ష్యాలను సాధించలేమనేమో అనే భయం పెరిగిపోయింది.విఫలమైన వివాహాల ప్రభావం : గొడవలు, కుటుంబ హింస, విడాకులు వంటి సమస్యలు ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో వివాహాన్ని ఒక సమస్యల పుట్టగా భావిస్తున్నారు. ఒకరి తప్పు వల్ల మరొకరి జీవితం నాశనం అవుతుండడం చూసి వివాహం అంటేనే ఒకవిధమైన భయం పెరుగుతోంది.స్వేచ్ఛకు అలవాటు : ఒంటరిగా జీవించడం వల్ల స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చనే అభిప్రాయం బలపడుతోంది. వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించడానికి కూడా పెళ్లి అడ్డుగా ఉంటుందని నమ్మే వారి సంఖ్య పెరుగుతోంది. వివాహం అంటే సర్దుకుపోవాలని, రాజీ పడాల్సి వస్తుందని భావిస్తూ పెళ్లి చేసుకోవడానికి త్వరగా మొగ్గు చూపలేకపోతున్నారు.మానసిక సమస్యలు : ఆందోళన, డిప్రెషన్, ట్రామా వంటి మానసిక సమస్యలు కూడా యువతలో ఎక్కువవుతున్నాయి. అలాంటి స్థితిలో ఉన్నవారంతా "మానసికంగా స్థిరంగా లేనప్పుడు వివాహం చేసుకోవడం సమంజసం కాదేమో?" అని తమను తాము ప్రశ్నించుకుంటున్నారు .ఒంటరితనం : వయసు పెరిగే కొద్ది స్నేహాలు తగ్గుతాయి. కుటుంబంతోనూ ఎక్కువగా గడిపేందుకు వీలు పడదు. ఈ పరిస్థితి రాను రానూ మరింత ఇబ్బందిగా మారుతుంది. ఈ క్రమంలో భావోద్వేగ మద్దతు లేకపోవడం వల్ల ఒంటరితనం తీవ్రమవుతుంది.కుటుంబ ఒత్తిడి, విమర్శలు : "ఇంకెప్పుడు పెళ్లి?" పెళ్లి చేసుకోకుండా ఎంత సంపాదించి ఏం లాభం?' వంటి ప్రశ్నలు మానసికంగా గాయపరుస్తాయి."డెస్టినేషన్ వెడ్డింగ్?" ప్లాన్ చేస్తున్నారా? – మనకు దగ్గర్లోనే అద్భుతమైన ప్రదేశాలు!రాజీ, పేచీ : 30 ఏళ్ల వయసు దాటిన తర్వాత మంచి జీవిత భాగస్వామి దొరకడం కష్టం. అనేక రకాలుగా రాజీపడాల్సి వస్తుంది. బాగా వయసు మీరిన తరువాత పెళ్లి చేసుకోవడం వల్ల, అమ్మాయి, అబ్బాయిలో స్వతంత్ర భావాలు అధికమై, తమ మాటే నెగ్గాలని పట్టుదల పెరుగుతుంది. సర్దుకుపోయే తత్వం తగ్గిపోతుంది. దాంతో చిన్న చిన్న సమస్యలకే విడాకుల వరకూ వెళ్తారని నిపుణులు చెబుతున్నారు.వృద్ధాప్యంలో భద్రతా సమస్యలు : పెళ్లి ఆలస్యమైతే, ఆ ప్రభావం సంతానంపైనా, వారి అలనాపాలనపైనా పడుతుంది. ఈ పరిస్థితి మానసికంగా, శారీరకంగా కుంగదీస్తుంది.సామాజిక అసమతుల్యత : వివాహాలు తగ్గితే జనాభా నిష్పత్తి మారుతుంది. యువ జనాభా తగ్గుతుంది. వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. ఫలితంగా సమాజంపై ప్రభావం పడుతుంది.వయసు మీరినా పెళ్లి చేసుకోకపోతే పిల్లలు పుట్టే అవకాశాలు తగ్గుతున్నాయంటున్నారు డాక్టర్లు. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల్లో పెల్విక్ బోన్స్ బలహీనపడి సాధారణ ప్రసవమయ్యే అవకాశాలు తగ్గుతాయట.సంతాన సాఫల్యతా తగ్గుతుంది. ఈ క్రమంలో అండాశయాన్ని ఉత్తేజిత పరిచే మందులు వాడాల్సి వస్తుంది. అప్పుడు 'ఒవేరియన్ హైపర్ సిమ్యులేషన్ సిండ్రోమ్' ఎదురవుతుంది. అది శరీరంలోని మిగిలిన వ్యవస్థల్ని ప్రభావితం చేస్తుందని చెబుతున్నారు. అందుకే సరైన సమయంలో పెళ్లి చేసుకోవాలని సూచిస్తున్నారు.

# కేరళ "సూక్ష్మ" వ్యూహం – ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా?

జాతీయ, రాష్ట్ర పక్షులు, జంతువులను చూశాం. కేరళ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి బ్యాసిలస్ సబ్టిలస్ అనే బ్యాక్టీరియాను 'రాష్ట్ర సూక్ష్మజీవి' ప్రకటించింది. మంచి సూక్ష్మజీవులపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ చర్యను చేపట్టింది. దేశంలో ఇలాంటి నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందింది. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో సూక్ష్మజీవుల పాత్రపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటి ఫలితాలను సమాజహితానికి అందుబాటులోకి తీసుకురావడానికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మైక్రోబయోమ్?ను కూడా ప్రారంభించింది. ఈ క్రమంలో బ్యాసిలస్ సబ్టిలస్ అంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం!
సూక్ష్మజీవులు అనగానే ఎక్కువ మందికి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లే గుర్తొస్తుంటాయి. కానీ, కంటికి కనిపించకపోయినా మానవులకు, ప్రకృతికి ఇతోధికంగా సేవలు అందించే 'మంచి బ్యాక్టీరియా' కూడా ఉంటుంది. నిజానికి, పర్యావరణంలో హానికారక బ్యాక్టీరియా 1 శాతం లోపే. మిగతా 99 శాతం, ప్రయోజనకరమైనవో, తటస్థమైనవో కావడం గమనార్హం. భారత్?కు ఇప్పటికే ల్యాక్టోబ్యాసిలస్ బల్గేరికస్‌ను జాతీయ సూక్ష్మజీవిగా ప్రకటించింది. ఒక రాష్ట్రం కూడా ఆ ఏమిటీ బ్యాసిలస్ సబ్టిలస్ :కేరళ ప్రభుత్వం ఎంచుకున్న బ్యాసిలస్ సబ్టిలస్ సూక్ష్మజీవి, నేలలో, మానవ పేగుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది కడ్డీ ఆకృతిలో ఉండే గ్రామ్ పాజిటివ్ రకం బ్యాక్టీరియం. ప్రకృతి, ఆరోగ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.ఈ సూక్ష్మజీవి తీవ్ర వేడి, అతినీలలోహిత రేడియోధార్మికత, అత్యంత ప్రతికూలంగా ఉండే రోదసి వాతావరణాన్ని తట్టుకోగలదు. ఏకంగా ఆరేళ్ల పాటు అంతరిక్షంలో మునుగడ సాగించడం ద్వారా ఒక రికార్డు సృష్టించింది. అమెరికా ఉపగ్రహంపై ఇది అన్నేళ్లపాటు జీవించింది.మొక్కలకూ ఇది ప్రోబయాటిక్‌గా ఉపయోగపడుతుంది. శిలీంద్రాలు, బ్యాక్టీరియా నుంచి రక్షణ కల్పిస్తుంది. వృద్ధిని పెంపొందిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మానవుల, జంతువుల ప్రోబయోటిక్స్‌కు ఇది సురక్షితమైందని వెల్లడైందిరైబోఫ్లావిన్ వంటి విటమిన్లు, యాంటీబయాటిక్స్ వంటి వాటి ఉత్పత్తికి దీన్ని ఉపయోగిస్తుంటారు. బయోటెక్నాలజీలో దీన్ని విరివిగా వాడుతుంటారు. పులియబెట్టిన ఆహార పదార్థాల్లో ఉంటుంది. అమైలేజ్‌లు, ప్రొటియాజెస్ వంటి 60 శాతం వాణిజ్య ఎంజైమ్?ల ఉత్పత్తిలో దీని ప్రమేయం ఉంటుంది.కొన్ని రకాల బ్యాసిలస్ సబ్టిలస్?ను సెల్ఫ్ హీలింగ్ కాంక్రీటులో ఉపయోగిస్తారు. అక్కడ అవి క్యాల్షియం కార్బొనేట్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా పగుళ్లను నింపుతాయి.ప్రయోజనకర సూక్ష్మజీవులు : సూక్ష్మజీవులతో ఫెర్మెంటేషన్ టెక్నాలజీ మార్కెట్ విలువ భారత్‌లో రూ. 40 వేల కోట్ల మేర ఉండొచ్చని అంచనా. 2030 నాటికి అది రూ. 72



వేల కోట్లకు పెరొగొచ్చని హొరైజన్ గ్రాండ్ వ్యూ రీసెర్చ్ పేర్కొంది. యాంటీ బయోటిక్స్, టీకాలు, ఎంజైమ్‌లు, ఔషధాల్లో వాడే ఏపీఐల ఉత్పత్తికి ఉపయోగించే బ్యాక్టీరియా ఫెర్మెంటేషన్ దీనికి అదనం. బయోఫర్టిలైజర్లు, బయోపెస్టిసైడ్ల ఉత్పత్తికి కూడా బ్యాక్టీరియాను వాడుతుంటారు. ఈ పరిశ్రమలో ప్రధానంగా ల్యాక్టోబ్యాసిలస్, బైఫిడోబ్యాక్టీరియం, బ్యాసిలస్ రకాలపై ఆధారపడుతుంటారు.చికిత్సల్లో : సూక్ష్మజీవులు ఆధారిత చికిత్సలు కూడా వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇందులో ఒక వ్యక్తి పేగుల్లోని బ్యాక్టీరియాను విశ్లేషించి, వాటి ఆధారంగా చికిత్సలను అందిస్తున్నారు. ఈ చికిత్సల్లో, ప్రయోజనకర బ్యాక్టీరియాను ప్రోది చేసి, హానికరమైన వాటిని తగ్గిస్తున్నారు. మానవ శరీరంలో 100 లక్షల కోట్ల బ్యాక్టీరియా ఉంటుంది. అందులో 85 శాతం ప్రయోజనకరమైనవే.
చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఆంధ్రాలో శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం– ఒక్కసారి దర్శిస్తే చాలు మోక్షం ఖాయం!

అనంత పద్మనాభ స్వామి అనగానే ముందుగా గుర్తొచ్చేది కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయం. ఆ ఆలయానికి చెందిన అపారమైన ధనం సంపద. అంతటి ధనిక ఆలయం కానప్పటికీ మన తెలుగు రాష్ట్రంలో కూడా చారిత్రక ప్రసిద్ధమైన అనంత పద్మనాభ స్వామి ఆలయం ఉంది. గుహాలయాలుగా ప్రసిద్ధి చెందిన అతి ప్రాచీనమైన ఈ ఆలయం ఎక్కడ ఉంది? ఆలయ విశేషాలేమిటో ఈ కథనంలో చూద్దాం.

అతి ప్రాచీనం– చరిత్రాత్మకం

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి అతి ప్రాచీనమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన గ్రామం. విజయవాడ ప్రకాశం బ్యారేజి దాటి మంగళగిరి రహదారి పై కొద్దిగా ముందుకు వెళ్లి అమరావతి రోడ్డులో 5 కి.మీ దూరంలో ఉండవల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి గుహాలయాలు వెలసి ఉన్నాయి. ఉండవల్లి గుహలుగా ప్రసిద్ధి చెందిన ఈ గుహాలయాలు క్రీ.శ 420 –620 ప్రాంతంలో ఆంధ్రదేశాన్ని





పాలించిన విష్ణుకుండినుల కాలం నాటి నిర్మాణాలుగా చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు. విష్ణు కుండినులు మొదట్లో బౌద్ధమతానుయాయులుగా అనంతరం హిందూమతాన్ని ప్రోత్సహించినట్లు చరిత్ర చెపుతోంది.

నిర్మాణ సోయగం

గుహాలయాల నిర్మాణ కౌశలం చూస్తే 'ఆహా!' అనిపిస్తుంది. ఒకే కొండను నాలుగంతస్తుల గుహాలయాలుగా, విశాలమైన విహారాలుగా, మందిరాలుగా, అందమైన స్థంభాలుగా, బౌద్ధ, శైవ, వైష్ణవ దేవతామూర్తులుగా వివిధా కృతుల్లో మలచి ఉండడం చూస్తుంటే ఆనాటి శిల్పుల అనన్య శిల్ప నైపుణ్యానికి ఎవరైనా వందనాలు సమర్పించాల్సిందే! గుహాలయంలో శ్రీ అనంత పద్మనాభుని 20 అడుగుల ఏకశిలా విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. మరి నాలుగు అంతస్థులతో ఉన్న ఈ గుహాలయంలో ఏ అంతస్తులో ఏమేమి విశేషాలు ఉన్నాయో చూద్దాం.

మొదటి అంతస్తు

ఉండవల్లి గుహాలయంలో మొదటి అంతస్తులో గుప్తుల, చాళుక్యుల కాలపు శిల్ప నిర్మాణం కనిపిస్తుంది. అయితే ఇవి అసంపూర్తిగానే ఉన్నాయి. తొలుత బౌద్ధ సన్యాసుల విహారాలుగా ఉండేటట్లుగా వీటి నిర్మాణం ప్రారంభమైంది. ఈ గుహల్లో ఒక గుహ నుంచి ఇంకో గుహలోకి వెళ్ళడానికి మార్గం ఉంటుంది. అలాగే విశాలమైన తిన్నెల నిర్మాణాన్ని కూడా చూడవచ్చు.

రెండో అంతస్తు

మొదటి అంతస్తు నుంచి మెట్లమార్గం ద్వారా రెండో అంతస్తుకు చేరుకోవచ్చు. ఈ అంతస్తులో గతంలో త్రిమూర్తుల మందిరాలు ఉండేవని అంటారు కానీ ప్రస్తుతం వాటి తాలూకు అవశేషాలు మాత్రమే మిగిలున్నాయి. త్రిమూర్తుల ఆలయాలు ఉన్నట్లుగా భావించే గదులు, మందిరాలకు సన్నని తీగలున్న తలుపులు ఉంటాయి. మూసిన తలుపుల వెనుక చీకట్లో ఏవేవో దేవతామూర్తులను పెకలించిన గుర్తులు మాత్రం అస్పష్టంగా కన్పిస్తాయి.

మూడో అంతస్తు చారిత్రక నేపథ్యం

రెండో అంతస్థు నుంచి మూడో అంతస్తులో చేరుకోవడానికి మెట్ల మార్గం ఉంటుంది. ఈ గుహాలయంలోని నాలుగు అంతస్తులు కూడ రాయిను తొలిచి చేసిన నిర్మాణాలే కాని, ఇవి పునాదులు వేసి నిర్మించినవి కానీ, ఇందులోని విగ్రహాలు ఎవరో ప్రతిష్ఠించినవి కానీ కావు. మూడో అంతస్తు పూర్తిగా విష్ణు సంబంధమైన గుహాలయం. సాధారణంగా గుహాలయాలు అనగానే బౌద్ధ, జైన గుహాలయాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి కాని వైష్ణవ గుహాలయం ఉండటం ఇక్కడొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. కొండవీడు రెడ్డి రాజులకు రాజ్యాధికారిగా పనిచేసిన మాధవరెడ్డి ఈ అనంత పద్మనాభుని గుహాలయం నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది.

ఎన్నో శిధిల శాసనాలు

రెండో అంతస్తుకు వెళ్ళే మెట్ల మార్గం ప్రక్కనే ఉన్న కొండపై శాసనం ఒకటి శిథిలమై కన్పిస్తోంది. ఇక్కడ నుంచి 9 కి.మీ దూరం సొరంగమార్గం మంగళగిరి నరసింహ స్వామి కొండపైకి ఉందని, ఆ రోజుల్లో సాధువులు, మునులు కృష్ణానదిలో స్నానానికి, పానకాల నరసింహుని దర్శనానికి ఈ మార్గం ద్వారా



రాకపోకలు సాగించేవారని ప్రచారం జనబాహుళ్యంలో ఉంది. ఈ విషయాన్ని 'మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి' అనే వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది. అంతేకాకుండా రాజులు యుద్ధ సమయాల్లో శత్రు రాజులకు తెలియకుండా సైన్యాన్ని ఈ సొరంగమార్గం ద్వారా తరలించేవారని కూడా తెలుస్తోంది. అయితే ప్రస్తుతం వివిధ కారణాల వల్ల ఈ సొరంగ మార్గాన్ని మూదివ్యానుభూతి కలిగించే మూడో అంతస్తు

మూడో అంతస్తులోనికి వెళ్లడానికి గుహను అందంగా తొలిచి మెట్ల మార్గాన్ని నిర్మించారు. మెట్లను మలిచిన విధానంలోనే ఈ అంతస్తు ప్రత్యేకత తెలుస్తుంది. ఈ గుహాలయంలోకి ప్రవేశించడమే ఓ వింత అనుభూతిని కల్గిస్తుంది. రెండు వరుసల స్తంభాల మధ్యలో విశాలమైన మండపం భక్తులకు విశ్రాంతి మండపంగా ఆహ్వానిస్తుంది. మండపం స్థంభాలపై దశావతారాలు, వివిధ దేవతామూర్తుల శిల్పాలు కొలువు తీరి చూడగానే పలకరిస్తున్నట్లుగా భ్రాంతి కలుగుతుంది. ఎడమవైపు తిరిగితే వరుసగా కొండను తొలిచి తీర్చిదిద్దిన శిల్పాలు కనువిందు చేస్తాయి. వాటిలో ముందుగా మనల్ని ఆకర్షించేది గణనాయకుడైన వినాయకుని రమణీయ శిల్పం.

మహా గణపతి రమణీయ శిల్పం

మూడో అంతస్తులో మహా గణపతి రమణీయ శిల్పం సందర్శకులకు అమితమైన ఆనందాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే గజాననుని తొండం మీద కన్పించే గజచర్మం ముడతలు సహజత్వానికి ప్రతీకగా నిలుస్తాయి.

ఉగ్ర నరసింహుడు

గుహాలయంలో మూడో అంతస్తులో ఒక మందిరంలో ఉన్న ఉగ్ర నరసింహుని స్వరూపం ఈ మండపంలోనే మూడు ప్రదేశాల్లో మనకు కన్పిస్తుంది. వీటిలో రెండు మాత్రం ఒకే పోలికతో ఉంటాయి. ఇవి కుడ్యచిత్రాలు కావడం విశేషం. ఈ కుడ్యచిత్రాల్లో శంకరునితో పాటు వివిధ దేవతల శిల్పాలను కూడా దర్శించుకోవచ్చు.

శ్రీ లక్ష్మీదేవితో ఆదివరాహస్వామి

మండపంలోని స్థంభాలపై కన్పించే చిత్రాల్లో అత్యంత అరుదుగా కన్పించే లక్ష్మీ సమేతుడైన ఆదివరాహస్వామి విగ్రహం రమణీయంగా దర్శనమిస్తుంది.

కుడ్య శిల్పం

ఈ మండపంలో మరొక స్తంభం మీద కన్పించే ఉగ్ర నరసింహుని శిల్పం తక్కిన రెండు శిల్పాల కంటే పూర్తి వైవిధ్యం కల్గిన మనోహర శిల్పం. ఈ శిల్పంలో హిరణ్యకశ్యపుని సంహరిస్తున్న నరసింహునిలో మహోగ్ర రూపం స్పష్టంగా గోచరిస్తుంది.

వామనావతార ఘట్టం

నరసింహుని శిల్పంకు సమీపంలోనే వామనావతార ఘట్టం కూడా చిత్రించి ఉంది. ఆ పక్కనే మరొక స్తంభం మీద హనుమత్ సందేశం ఘట్టం కూడా చిత్రించి ఉండటాన్ని గమనించవచ్చు.

శ్రీ అనంతపద్మనాభస్వామి

మూడో అంతస్తు చివరి మందిరంలో శ్రీ అనంత పద్మనాభుడు కొలువుతీరి ఉన్నాడు. సుందర మనోహరమైన ఈ స్వామి స్వరూపాన్ని చూడటానికి రెండు కళ్లు చాలవని భక్తులు భక్తిపారవశ్యంతో చెబుతుంటారు. నల్లని గ్రానైటు ఏకశిలా నిర్మితమైన ఈ విగ్రహం స్వరూపం ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది.

సమ్మోహితులను చేసే అనంత పద్మనాభుని స్వరూపం

శ్రీ అనంత పద్మనాభ స్వామి పద్మపత్ర విశాలాక్షుడై, అనంతశయనుడై, గగనచరులైన దేవతలందరూ ఆనందం నాట్యం చేస్తుంటే, జయవిజయులు పాదాల చెంత కర్తవ్య పాలనలో ఉండగా, మహర్షులు తపో నిమగ్నులై ఉండగా, ఆకాశంలో గరుడుడు నాట్యం చేస్తుంటే, అద్భుత స్వరూపంతో దర్శనమిస్తాడు. ఆ దివ్య మంగళ రూపాన్ని దర్శించి తరించాల్సిందే కానీ వర్ణింపనలవి . ప్రతిరోజు ఉదయం ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకు స్వామి దర్శనం ఉంటుంది. ఒక్క శనివారం రోజు మాత్రం దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. స్వామిని దర్శించిన భక్తులు చల్లే పసుపుకుంకుమలతో నల్లని అనంత పద్మనాభుని రూపం ఎర్రగా మారిపోయి, ఎర్ర గ్రానైట్?తో చెక్కిన శిల్పంలా గోచరించడం నాభి కమలం నుంచి ఉద్భవించిన బ్రహ్మ శ్రీ పద్మనాభుని మందిరంలోని అనంత పద్మనాభుని పరిశీలనగా గమనిస్తే స్వామి తో పాటు పద్మోద్భవుడైన బ్రహ్మ, ఆనందంలో సురేశుని కీర్తిస్తున్న దేవతలు, ధ్యానంలో ఉన్న రుషులు, ఆయుధ పాణులైన అంగరక్షకులు, గగనంలో నర్తిస్తున్న గరుత్మంతుని కూడా దర్శించవచ్చు.

నాగబంధం

మూడో అంతస్తులో మండపానికి వెలుపల నాగబంధం ఉందని ప్రతీతి. అందువల్ల ఈ పరిసరాల్లో ఎక్కడో విలువైన సంపద కాని, విలువైన చారిత్రాత్మక గ్రంథాలు కానీ ఉండి ఉంటాయన్న ప్రచారం కూడా ఉంది.

ఎలా చేరుకోవాలి?

విజయవాడకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి బస్సు, రైలు, విమాన సౌకర్యాలు ఉన్నాయి. విజయవాడ నుంచి ఉండవల్లి సెంటరు వరకు బస్సులో వచ్చి అక్కడ నుంచి ఈ గుహాలయాలకు సులభంగా చేరుకోవచ్చు. అత్యంత అద్భుతమైన శిల్ప కళాసంపదకు తార్కాణంగా నిలిచే ఉండవల్లి గుహాలయాలు దర్శించడం ఒక అరుదైన, అపురూపమైన దివ్యానుభూతి. మనం కూడా ఉండవల్లి గుహాలయాలను దర్శిద్దాం. దివ్యానుభూతిని సొంతం చేసుకుందాం.

ఓం శ్రీ అనంత పద్మనాభ స్వామినే నమః!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

మల్కాజిగిరి
Volume : 1
Issue No : 1
గురువారం,
ఫిబ్రవరి 05, 2026
నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY


# వామ్మో.. పట్టపగ్గాల్లేకుండా పెరుగుతున్న బంగారం ధరలు ఒకేసారి



బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. దాదాపుగా అయిదు రోజుల పాటు మార్కెట్ ను షేక్ చేసిన అనంతరం పైపైకి ఎగబాకడం మొదలు పెట్టాయి. నేడు బంగారం, వెండి ధరల రేట్లు రెండు శాతానికి పైగా పెరిగాయి. ఈ రెండింటి ధరలు పెరగడం వరుసగా ఇది రెండో రోజు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో భారత్ పై విధించిన టారిఫ్ ను 18 శాతం మేర తగ్గించడమే దీనికి ప్రధాన కారణం. అటు డాలర్ బలపడటంతో బుధవారం బంగారం, వెండి ధరలు గణనీయమైన ర్యాలీని కొనసాగించాయి. పసిడి రెండు శాతానికి పైగా లాభపడింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,60,000 రూపాయలను అధిగమించింది. పెట్టుబడిదారుల్లో ఆశలను మొలకెత్తించింది. అంతర్జాతీయ మార్కెట్ కామెక్స్ లో స్పాట్ గోల్డ్ 2.2 శాతం వృద్ధితో ఔన్స్‌కు 5,044.74 డాలర్లకు చేరింది. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్ 2.7 శాతం పెరిగి ఔన్స్‌కు 5,067 డాలర్లకు చేరుకున్నాయి. గత గురువారం పసిడి ధర ఔన్స్‌కు 5,594.82తో రికార్డు స్థాయిని తాకిన విషయం తెలిసిందే. స్పాట్ వెండి ధర కూడా 2.1 శాతం పెరిగి ఔన్స్‌కు 86.92 డాలర్లకు చేరింది.

పాతాళానికి పడిపోతున్న బంగారం ధరలు"పాతాళానికి పడిపోతున్న బంగారం ధరలు"ప్రధాన నగరాల్లో నేటి బంగారం ధరలు (గ్రాముకు)చెన్నై..24 క్యారెట్లు- రూ. 16,256, 22 క్యారెట్లు - రూ. 14,900, 18 క్యారెట్లు - రూ. 12,750

ముంబై..24 క్యారెట్లు - రూ. 16,053, 22 క్యారెట్లు- రూ. 14,715, 18 క్యారెట్లు - రూ. 12,040బెంగళూరు..24 క్యారెట్లు - రూ. 16,053, 22 క్యారెట్లు- రూ. 14,715, 18 క్యారెట్లు- రూ. 12,040

# గ్రీన్ ఎనర్జీ బూస్ట్.. రాగి విలువ డబుల్




ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక-రాజకీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా దూసుకుపోతున్నాయి. బంగారం, వెండి సరసన ఇప్పుడు రాగి కూడా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరగడం, సరఫరా కొరతలు తలెత్తడం వల్ల రాగి ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. ముఖ్యంగా విద్యుతీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐ డేటా సెంటర్ల అవసరాలు ఈ లోహానికి గిరాకీని మరింత పెంచుతున్నాయి.రాగి వినియోగం పెరుగుతున్నప్పటికీ, ఉత్పత్తి మాత్రం ఆ స్థాయిలో పెరగకపోవడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. గనుల కార్యకలాపాల్లో అంతరాయాలు, పర్యావరణ నిబంధనలు, కార్మిక సమస్యలు వంటి అంశాలు సరఫరాను పరిమితం చేస్తున్నాయి. దీనికి తోడు అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, వాణిజ్య ఆంక్షలు కూడా మార్కెట్లలో అనిశ్చితిని పెంచుతున్నాయి.ప్రపంచంలో రాగి అత్యధికంగా లభించే దేశాల్లో చిలీ అగ్రస్థానంలో ఉంది. మొత్తం గ్లోబల్ ఉత్పత్తిలో దాదాపు నాలుగో వంతు చిలీ నుంచే వస్తోంది. చిలీ గనుల్లో ఉత్పత్తి తగ్గినప్పుడు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు వెంటనే పెరుగుతుంటాయి. అందుకే చిలీ పరిస్థితులపై ప్రపంచ మార్కెట్లు నిశితంగా దృష్టి పెడతాయి.భారీగా జశీజూజూవతీ ఉత్పత్తి పెంచినా..ఆఫ్రికా ఖండంలో డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో రాగి ఉత్పత్తిలో వేగంగా ఎదుగుతోంది. ఇటీవలి సంవత్సరాల్లో ఈ దేశం భారీగా ఉత్పత్తి పెంచినా, రాజకీయ అస్థిరత మరియు మౌలిక వసతుల లోపాలు సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ఇదే సమయంలో దక్షిణ అమెరికాలోని పెరూ కూడా ప్రధాన ఉత్పత్తిదారుగా ఉంది. అక్కడ గనుల చుట్టూ జరిగే ఆందోళనలు, సమ్మెలు సరఫరాను ప్రభావితం చేస్తున్నాయి.మరోవైపు చైనా ప్రపంచంలోనే అతిపెద్ద రాగి వినియోగదారుగా ఉంది. నిర్మాణ రంగం, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రాగిని వినియోగిస్తున్నాయి. అందుకే చైనాలో డిమాండ్ పెరిగిన ప్రతిసారి అంతర్జాతీయ ధరలు ఊపందుకుంటున్నాయి. ఇండోనేషియా, అమెరికా వంటి దేశాలు కూడా రాగి ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రపంచ అవసరాలను పూర్తిగా తీర్చే స్థాయికి ఉత్పత్తి ఇంకా చేరలేదనే అభిప్రాయం ఉంది.మొత్తంగా చూస్తే, రాగి మార్కెట్‌లో డిమాండ్-సరఫరా మధ్య ఉన్న అసమతుల్యతే ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. గ్రీన్ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ మౌలిక వసతుల విస్తరణ కొనసాగుతున్న నేపథ్యంలో రాగి ప్రాధాన్యం మరింత పెరిగే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో కూడా రాగి ధరలు స్థిరంగా తగ్గే అవకాశాలు తక్కువేనని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు

# అటుకులు తింటే ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు.. తెలిస్తే వదిలిపెట్టరు



అటుకులు రుచికరమైన ఆహారం మాత్రమే కాదు.. శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల బరువు తగ్గుతారు. బ్రేక్ ఫాస్ట్ గా, రాత్రుళ్లు డిన్నర్‌లో అటుకులతో తయారు చేసే పోహా ఎంతో రుచికరంగా ఉంటుంది. అటుకులు చాలా తేలికగా ఉంటాయి. వడ్లను ఉడికించి, ఎండబెట్టి ఆపై దంచుతారు. ఇది జీర్ణ సమస్యలు ఉన్నవారికి బెస్ట్ ఫుడ్ అని చెప్పొచ్చు.

1.ఐరన్:రక్తహీనత ఉన్నవారికి అటుకులు ఒక వరమనే చెప్పాలి. గర్భిణులు, పిల్లలకు ఇందులో ఉండే పోషకాలు ఎంతో బలాన్ని ఇస్తాయి. అటుకులపై కొంచెం నిమ్మరసం పిండుకుని తింటే, అందులో విటమిన్- సి వల్ల ఐరన్ మన శరీరానికి బాగా అందుతుంది. 2. శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లు:అటుకుల్లో సుమారు 76.9 శాతం ఆరోగ్యకరమై కార్బోహైడ్రేట్లు ఉంటాయి. అందుకే ఉదయాన్నే వీటిని తింటే రోజంతా యాక్టివ్‌గా ఉండటానికి అవసరమైన శక్తి లభిస్తుంది. 3. బరువు తగ్గడానికి సహకరిస్తాయి:బరువు తగ్గాలనుకునే వారు అటుకులను నిరభ్యంతరంగా తినవచ్చు. వీటిలో కేలరీలు తక్కువ, ఫైబర్ ఎక్కువ. దీని వల్ల కడుపు నిండుగా అనిపించి, అనవసరమైన ఆకలిని తగ్గిస్తుంది. 4. రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ:అటుకుల్లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి, కాబట్టి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి కూరగాయలు, వేరుశనగలు, పప్పులతో కలిపి తీసుకోవడం మంచిది. 5. గ్లూటేన్ లేని ఆహారం:గోధుమలు పడని వారు, గ్లూటెన్ అలర్జీ ఉన్నవారు అటుకులు తినవచ్చు. ఇది సహజంగానే గ్లూటెన్ రహితం కాబట్టి ఎలాంటి మంట, అలర్జీ సమస్యలు రావు. 6. మెదడు పనితీరుకు మేలు:అటుకుల్లో ఉండే విటమిన్-బి మెదడు చురుగ్గా పనిచేయడానికి సహకరిస్తుంది. ఇది ఏకాగ్రతను పెంచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి దోహదపడుతుంది. 7. తక్కువ కొలెస్ట్రాల్: అటు కుల్లో కొవ్వు పదార్థాలు దాదాపు సున్నా, వీటిని వేయించకుండా, తక్కువ నూనెతో పోపు పెట్టుకుని తింటే గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. బియ్యంతో తయారయ్యే ఈ అటుకులు అన్నం తిన్నంత తృప్తినిస్తాయి. 8. ఎర్ర అటుకులు బెస్ట్:పల్చటి అటుకుల కంటే, దొడ్డు అటుకులు లేదా ఎర్ర అటుకులు వాడటం శ్రేయస్కరం. ఎర్ర అటుకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి.

# టోన్డ్ మిల్క్ లేదా నార్మల్ మిల్క్.. బరువు తగ్గడానికి ఏది మంచిది



పాలు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కాల్షియం, ప్రోటీన్, పొటాషియం, ఫాస్ఫరస్, విటమిన్లు వంటి ముఖ్యమైన పోషకాలతో పుష్కలంగా ఉంటాయి. ఎముకల బలానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, అలాగే 13 రకాల కీలకమైన పోషకాలను అందించడంలో పాలు సహాయ పడుతాయి. కానీ మీ ఆరోగ్య స్థితిని బట్టి దాని ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.ఆరోగ్య నిపుణుల ప్రకారం, బరువు తగ్గాలనుకునే వారికి టోన్డ్ మిల్క్ మంచి ఎంపిక. టోన్డ్ పాలలో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది (సుమారు 3%). ఫుల్ క్రీమ్ పాలలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. కొవ్వు తక్కువగా ఉండటం వల్ల టోన్డ్ పాలలో కేలరీలు కూడా తక్కువ. అయితే, టోన్డ్ పాలలో ప్రోటీన్, కాల్షియం, విటమిన్లు మాత్రం దాదాపు ఫుల్ క్రీమ్ పాలతో సమానంగానే ఉంటాయి. కాబట్టి కండరాలు, ఎముకలు, శరీర జీవక్రియకు అవసరమైన పోషకాలు అందుతాయి.ఫుల్ క్రీమ్ పాలు ఎక్కువ సంతృప్త కొవ్వును కలిగి ఉంటాయి. అవి ఎక్కువగా తీసుకుంటే శరీరంలో కొవ్వు నిల్వ అయ్యే అవకాశం ఉంటుంది. కానీ చాలా చురుకుగా పనిచేసే వాళ్లు లేదా త్వరగా ఆకలి వేసే వాళ్లు పరిమితంగా తీసుకోవచ్చు.

# వెండి కొనేముందు ఈ 5 ముఖ్యమైన విషయాలు తప్పక గుర్తుంచుకోండి



ఇటీవల వెండి ధరలు కొంతకాలం పెరిగిన తర్వాత ఇప్పుడు ఒక్కసారిగా తగ్గాయి. దీంతో మళ్లీ వెండి కొనుగోళ్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మీరు వెండి నగలు, పాత్రలు లేదా ఇతర వస్తువులు కొనాలని అనుకుంటే, కొన్ని విషయాలు తప్పకుండా గుర్తుంచు కోవాలి. బంగారంతో పోలిస్తే వెండి చౌకగా ఉండటంతో చాలామంది దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తారు. నగలు, పాత్రలు వంటి ఎన్నో వస్తువులు వెండితో తయారు చేస్తారు. ఇటీవల వెండి ధరలు తగ్గడంతో, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ మొదలవుతున్న ఈ సమయంలో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే వెండి కొనే ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టపోయే ప్రమాదం ఉంటుంది.భారతీయ ఇళ్లలో పెళ్లిళ్లు, శుభకార్యాల సమయంలో బంగారం, వెండి కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతాయి. ఈ సమయంలో ధరలు తగ్గడం సంతోషకరమే అయినా, కొనే సమయంలో కొన్ని చిన్న విషయాలు గుర్తుపెట్టుకుంటే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.హాల్‌మార్క్ తప్పనిసరిబంగారం కొన్నప్పుడు ఎలా స్వచ్ఛత చూసుకుంటామో, అలాగే వెండి కొనేటప్పుడు కూడా జాగ్రత్త అవసరం. వెండి కొనుగోలు చేస్తున్నప్పుడు దీ×ూ హాల్‌మార్క్ ఉందో లేదో తప్పనిసరిగా చూడాలి.

## అంబేద్కర్ విగ్రహానికి నివాళి.. ఆపై ప్రచారం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 04ఫిబ్రవరి :**బోధన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సలర్ అభ్యర్థి శ్రీలక్ష్మి బుధవారం తన ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రచారానికి ముందు ఆమె వార్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. రాజ్యాంగ నిర్మాత ఆశయాలకు అనుగుణంగా, అణగారిన వర్గా ల సంక్షేమం వార్డు అభివృద్ధి కోసం తాను నిరంతరం శ్రమిస్తానని ఆమె ఓటర్లకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## బోధన్ 25వ వార్డులో తుము శరత్ రెడ్డి ముమ్మర ప్రచారం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 04ఫిబ్రవరి :**బోధన్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 25వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు తుము శరత్ రెడ్డి బుధవారం వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వార్డులోని ప్రతి గల్లీలో పర్యటిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, వార్డు ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉండే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సహకారంతో బోధన్ పట్టణ రూపురేఖలు మారుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో బోధన్, సాలూర మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోధన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా గంగాధర్ ఏకగ్రీవ ఎన్నిక



**బోధన్, నిజామాబాద్ జిల్లా, 04ఫిబ్రవరి :**బోధన్ మండల సర్పంచ్‌ల ఫోరం నూతన అధ్యక్షుడిగా అమ్దాపూర్ గ్రామ సర్పంచ్ పోరెడ్డి గంగాధర్ ఎన్నికయ్యారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్పంచ్‌ల ఫోరం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మండలంలోని సర్పంచ్‌లందరూ ఏకగ్రీవంగా గంగాధర్‌ను తమ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పోరెడ్డి గంగాధర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన మండల సర్పంచ్‌లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, గ్రామాల అభివృద్ధి విషయంలో సమిష్టిగా ముందుకు సాగుతామని, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన గంగాధర్‌ను పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన




**బోధన్, నిజామాబాద్ జిల్లా, 04ఫిబ్రవరి :**నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల పర్యటన స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఐటీ వొకేషనల్ ఎడ్యుకేషన్ ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా సాలూర ఉన్నత పాఠశాల విద్యార్థులు నిజామాబాద్‌లోని ఐటీ టవర్‌ను బుధవారం సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఐటీ టవర్‌లోని పలు కంపెనీల ప్రతినిధులను విద్యార్థులు కలిశారు. సాఫ్ట్‌వేర్ సంస్థలు ఎలా పనిచేస్తాయి. సాంకేతిక నిపుణులుగా ఎదగాలంటే ఎలాంటి నైపుణ్యాలు ఉండాలి. అనే విషయాలను కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో కంప్యూటర్ టెక్నాలజీ రంగంలో స్థిరపడాలనుకునే విద్యార్థులకు ఈ సందర్శన ఎంతో మేలు చేస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం సారంగాపూర్ శివారులోని చిల్డ్రన్ పార్క్‌ను విద్యార్థులు సందర్శించారు. రోజంతా అకడమిక్, సాంకేతిక విషయాలు తెలుసుకున్న విద్యార్థులు పార్కులో కాసేపు ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు విజయలక్ష్మి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు విట్టల్ కాంబ్లే, ఐటీ వొకేషనల్ ఉపాధ్యాయులు జాదవ్ అక్షయ్ కుమార్, కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ అంజని, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ కృష్ణయ్య, ను కలిసిన ఉపాధ్యాయుల బృందం



**పరిగి ఫిబ్రవరి 5 :** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఢిల్లీలోని తన నివాసంలో ఎంపి రాజ్య సభ్యులు ఆర్. కృష్ణయ్య, ను కలిసిన పరిగి టి.ఎస్. యూ.టి.ఎఫ్. ఉపాధ్యాయ బృందం, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుండి మీన హాయింపు ఇవ్వాలని కోరారు. సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, చాలా రోజులుగా ఖాళీగా ఉన్న ఎంఈఓ , డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, వికారాబాద్ జిల్లాలో ఏ ఒక్క మండలంలో కూడా రెగ్యులర్ ఎంఈఓ లేకపోవడం శోచనీయమని తెలిపారు. ఉపాధ్యాయ రేషనలైజేషన్ ను విరమించుకోవాలని ఆర్. కృష్ణయ్య, ను కోరారు. ఇట్టి సమస్యలపై స్పందించి ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల అధ్యక్షులు దశరథ, ప్రధాన కార్యదర్శి జైపాల్, జిల్లా కార్యదర్శి వెంకటయ్య, రాష్ట్ర ఎఫ్ డబ్ల్యూ ఎఫ్ కమిటీ సభ్యులు బిచ్చయ్య దోమ మండల అధ్యక్షులు మేగ్య తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

**– బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి మాలే అలవేలు నర్సిములు**



**పరిగి ఫిబ్రవరి 5 :** ప్రజలు మాకు ఒక్క అవకాశం ఇచ్చి నన్ను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చిన తొమ్మిదవ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి మాలే అలవేలు నర్సిములు, ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 9 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి మాలే అలవేలు నర్సిములు, మంగళవారం నాడు పార్టీ నాయకులు, కార్యాకర్తల,తో కలిసి వార్డులో గడపగడపకు తిరుగుతూ.. బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తు కు ఓటు వేసి నన్ను గెలిపించాలని వార్డు ప్రజలను కోరుతూ.. ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగింది. వార్డు ప్రజలు సైతం సానుకూలంగా స్పందిస్తూ మాలే అలవేలు నర్సిములు, కు మద్దతు తెలిపారు. అనంతరం , మీడియా ముఖంగా అభ్యర్థి మాలే అలవేలు నర్సిములు, మాట్లాడుతూ.... 9 వ వార్డు ప్రజలు నాపై నమ్మకం ఉంచి కారు గుర్తుకు ఓటు వేసి నన్ను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని వారు అన్నారు. పరిగి పట్టణ మున్సిపల్ లోనే అన్ని వార్డులకు ఆదర్శంగా తొమ్మిదవ వార్డును అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి అందేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వారు తెలిపారు. 9 వ వార్డులో మౌలిక వసతులు కల్పించడమే నా ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రజల గొంతుకగా పని చేస్తానని స్పష్టం చేశారు. నిరంతరం వార్డు అభివృద్ధి కొరకు పనిచేసే నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని, ప్రజలను కోరారు.
ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి మున్సిపాలిటీలో మళ్ళీ ఎగిరేది గులాబీ జెండా నే

**– ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి**



**పరిగి ఫిబ్రవరి 5 :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం పరిగి మున్సిపల్ పరిధిలోని 15, 16, 17, వ వార్డు లలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ ర్థులు మీది గడ్డ శ్రీనివాస్, రహిమా బీ, ఎదిరే పద్మ కృష్ణ, లకు మద్దతుగా ఎన్నికల ప్రచా రంలో పాల్గొని కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికి తిరిగుతూ ప్రజలను కోరిన పరిగి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.... రెండు సంవత్సరాలుగా పరిగి మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అది చేస్తా ఇది చేస్తాం పట్టణాన్ని అభివృద్ధి చేస్తామంటూ భూమి పూజలు చేస్తూ హడావిడి చేస్తున్నారు. అసలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రానికి రేవంత్ రెడ్డి, పరిగి, కి ఇక్కడి ఎమ్మెల్యే ఏమైనా చేశారా ప్రజలు గమనించాలన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు అంటూ ప్రజలకు అడ్డమైన అడ్డుగోలు హామీలు ఇచ్చి ఇచ్చారు. అందులో అతి ముఖ్యమైనవి మహిళలకు ప్రతి నెల 2500, ఇందిరమ్మ ఇండ్లిస్తమన్నారు. కానీ కాంగ్రెస్ వాళ్ళు మాత్రం కమిషన్లు తీసుకోని ఇల్లు ఉన్నవారికే ఇచ్చింండ్రు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండరన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. విద్యార్థులకు 5 లక్షల రూపాయిలు విద్యా భరోసా కార్డు ఇస్తామన్నారు. రెండు వేల ఫింఛన్ ని నాలుగు వేలు, దివ్యాంగుల ఫింఛన్ ఆరు వేలు ఇస్తమన్నారు. రైతు రుణ మాఫీ కాలే. రైతు భరోసా రాలే. ఇట్ల జూఠా మాటలతోని గద్దెనిక్కిన కాంగ్రెసోళ్లకు మళ్లా ఎందుకు ఓటెయ్యాలేనో ప్రజలు ఆలోచించాలి. ఒక్క అవకాశం ఇచ్చిన పాపానికి, ప్రజలు అరిగోస పడుతున్నారు. మళ్లీ ఓట్ల కోసం కాంగ్రెస్ మీ ఇళ్ళ ముందుకు వస్తే ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి అని నిలదీయండి అంటూ మాజీ ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో 15, 16, 17, వ వార్డుల పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

**– వార్డు అభివృద్దే నా ప్రధాన లక్ష్యం**
**– బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి కే. నరేష్ యాదవ్**



**పరిగి ఫిబ్రవరి 5 :** ప్రజలు నాకు ఒక్క అవకాశం ఇచ్చి నన్ను ఆశీర్వదిస్తే వార్డు ను అన్ని విధాలుగ అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యం అని ఎన్నికల ప్రచారంలో ప్రజలను కోరిన 18 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కే. నరేష్ యాదవ్, ఈనెల 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పరిగి మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి కే. నరేష్ యాదవ్, మంగళవారం నాడు పార్టీ నాయకులు, కార్యాకర్తల,తో కలిసి వార్డులో గడపగడపకు తిరుగుతూ.. బిఆర్ఎస్ పార్టీ కారు గుర్తు కు ఓటు వేసి నన్ను గెలిపించాలని వార్డు ప్రజలను కోరరు. అనంతరం మీడియా ముఖంగా అభ్యర్థి నరేష్ యాదవ్, మాటా్ల డుతూ.... 18 వ వార్డు ప్రజలు నాపై నమ్మకం ఉంచి కారు గుర్తుకు ఓటు వేసి నన్ను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన అన్నారు. పరిగి పట్టణ మున్సిపల్ లోనే అన్ని వార్డులకు ఆదర్శంగా 18 వ వార్డును అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి అందేలా ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వార్డు పరిధిలోని ఏ కాలనీలో ఎలాంటి సమస్య ఉన్న వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నరేష్ యాదవ్, తెలిపారు. 18 వ వార్డులో మౌలిక వసతులు కల్పించడమే నా ప్రధాన లక్ష్య మని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, అం డర్ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారి స్తాన న్నా రు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడకుండా, ప్రజల గొం తుకగా పని చేస్తానని స్పష్టం చేశారు.
నిరంతరం వార్డు అభి వృ ద్ధి కొరకు పనిచేసే నాకు ఒక్క అవకాశం ఇవ్వాలని, ప్రజలను కోరారు.

# పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్య

**– ఘటన స్థలాన్ని పరిశీలించిన డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి**



**పరిగి ఫిబ్రవరి 5 :** పట్టపగలే నడి రోడ్డు పై అందరూ చూస్తుడగానే ఓ వ్యక్తిని దారుణంగా నరికి చంపిన ఘటన బుధవారం వికారాబాద్ జిల్లా, ధారూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ హత్యకు కారణం పాత కక్షలే అన్నట్టు స్థానికుల సమాచారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం రాంపూర్ తండాకు చెందిన శంకర్, అనే వ్యక్తి గత కొన్ని రోజుల క్రితం ఓ కోడి పంచాయతీలో నిందితుడు సాయి తండ్రిని హత్య చేసి జైలుకు వెళ్లి ఈ మధ్యనే ఇంటికి వచ్చినట్టు తెలిపారు. ఇది మనసులో పెట్టుకున్న నిందితుడు సాయి ఎలాగైనా శంకరును హతమార్చాలని పథకం వేసి బుధవారం మృతుడు శంకర్ దారూర్, మండల కేంద్రంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళు తుండగా వెనక నుండి స్కూటీతో ఢీ కొట్టడంతో శంకర్ కింద పడగానే నిందితుడు సాయి, తన వెంట తెచ్చుకున్న కత్తితో అందరూ చూస్తుండగానే శంకరు, ను దారుణంగా పొడిచి చంపి నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి లొంగిపోయినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక సీఐ, ఎస్ఐ, లతో కలిసి ఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ప్లాస్టిక్, ను నివారిద్దాం ప్రకృతిని పరిరక్షించుకుందాం


**– ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన**
**– ప్రకృతి ప్రజాకవి జయరాజ్, సామాజిక శాస్త్రవేత్త రమేష్**





**పరిగి ఫిబ్రవరి 5 :** ప్రకృతి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ప్రకృతి ప్రజా కవి జయరాజ్, సామాజిక శాస్త్రవేత్త రమేష్, ప్రకృతి వైజ్ఞానిక యాత్ర 6వ రోజు బుధవారం పరిగి పట్టణంలోని ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాల ఆవరణలో ప్లాస్టిక్ నిషేధం -- కెమికల్స్ వాడకం తగ్గించి ప్రకృతి, సాంకేతిక పరిజ్ఞానం పెంచుకుందాం, భారత రాజ్యాంగ విలువలను కాపాడుకుందాం" అనే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రజా కవి జయరాజ్, ప్రజా శాస్త్రవేత్త రమేష్, మండల ఎంఈఓ ప్రధానోపాధ్యాయులు, గోపాల్, మాట్లాడుతూ.. ప్రకృతి మన జీవనానికి ఆధారం అని, దాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుంది. కాబట్టి ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వైజ్ఞానిక దృక్పథం అంధ విశ్వాసాలకు ప్రత్యామ్నాయంగా ఉండాలని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి తీవ్ర హానికరం అని, భూమిలో వందల సంవత్సరాల వరకు కరుగకుండా ఉండి జీవరాసులకు ప్రమాదం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా పేపర్ సహజ వస్తువుల వినియోగం పెంచాలన్నారు. పాలిప్రోపైలిన్ వంటి కెమికల్స్ ఆరోగ్యానికి ప్రమాదకరమని, క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉందని తెలిపారు.
అనంతరం విజ్ఞాన దర్శిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆలీ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జయశ్రీ, జనవిజ్ఞాన వేదిక, విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో షర్టులకు పేపర్ పెన్నులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి.పి.టి.ఎల్.ఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు విజయ్, తెలంగాణ శ్యామ్, అమ్మ అవయవ దానం సంస్థ స్థాపకులు శంభో లింగం,
ఉపాధ్యాయుల బృందం వికారాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ పరిగి నియోజకవరం అధ్యక్షుడు శివ కుమార్, పరిగి నియోజకవరం గర్ల్స్ కన్వీనర్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తు బాగున్నా.. కచ్చితంగా చేయాల్సిన మార్పులు మాత్రం ఇవే..




వాస్తు అంతా బాగున్నప్పటికీ ప్రతి ఇంటికి కచ్చితంగా వాస్తులో 5 మార్పులు మాత్రం చేయాలి. దీనివల్ల అనేక ఆటంకాలు తొలగి పోతాయని వాస్తు నిపుణులు తెలియజేస్తున్నారు. అంతేకాకుండా లక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశి స్తుందని చెబుతున్నారు. వృథా ఖర్చులు తగ్గించు కొని వాస్తు సూచించిన విధంగా చిన్న చిన్న మార్పులు చేసుకోవడం వల్ల జీవితంలో ఆర్థికంగా స్థిరత్వం దొరుకుతుందని, మంచి స్థాయికి చేరుకుంటారని నిపుణులు నొక్కి వక్కాణి స్తున్నారు. వారు ఏమేం మార్పులు చెబుతున్నారు అనే వివరాలను ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం.ఇంట్లో ఉండే పూజా మందిరం శక్తి మొత్తం ఇంటిపై ఉంటుంది.
అది మిమ్మల్ని కాపాడుతుంటుంది.క్రిస్టల్ తో చేసిన శివలింగాన్ని పూజామందిరంలో ఉంచ ండి. ఇది మానసిక ప్రశాంతతను, సానుకూల శక్తిని ఇస్తుంది.దుమ్ము, పాత వస్తువులు లేకుండా చూడండి.పూజా మందిరాన్ని ఎప్పుడూ శుభ్రంగా ఉంచండి.
శివరాత్రి, హోళీ, దీపావళి లాంటి పర్వదినాల్లో 3 పాత రాగి నాణాలను శాస్త్రం ప్రకారం పూజించండి.వాటిని ఎర్రటి వస్త్రంలో కట్టి ఉంచండి.దాన్ని అలాగే తీసుకెళ్లి నగలు, డబ్బులు ఉండే లాకర్ లో పెట్టండి.ఇలా చేస్తే ఆ కుటుంబంలో వృథా అవుతున్న ఖర్చులన్నీ నియంత్రించబడతాయి.ఇంటి సింహద్వారం ఎదురుగా తులసిమొక్కను, అరిచెట్టును పెంచండి.ఇది వాస్తు దోషాలను తొలగిస్తు ంది.సానుకూల శక్తిని ప్రవేశిం పచేస్తుంది .కు టుంబ సభ్యుల మధ్య అనుబంధాన్ని పెం చుతుది.మీ అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది.ఇంట్లో ఎప్పుడూ ఆనందం ఉంటుంది.ప్రార్థనా మందిరంలో శంఖం ఊదాలి.దీనివల్ల ప్రతికూల శక్తులన్నీ తొలగిపో తాయి.శంఖంతో చేసే ధ్వని వాతావ రణాన్ని శు ద్ధి చేస్తుంది.ఈ ధ్వని లక్ష్మీదేవిని ఆకర్షిస్తుంది.ఆర్థిక ఇబ్బందులన్నీ తొలగిపో తాయి. సాయంత్రం వేళ దీపం వెలిగించి శంఖం ఊదాలి.ఇంట్లో పాత వస్తువులు ఉంచొద్దు.వంటగది, పూజా గది, డబ్బు ఉన్న ప్రదేశాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండాలి.

# ప్రయాణికులకు షాక్ ఫ్లైట్లు రద్దు, ప్రయాణికుల్లో టెన్షన్




ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రయాణికులకు ఊహించని షాక్ ఇచ్చింది. సుదూర అంతర్జాతీయ విమానాల షెడ్యూల్‌లో కీలక మార్పులు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ఫిబ్రవరి 4, 2026 బుధవారం విడుదల చేసిన ప్రకటనలో, బాహ్య కార్యాచరణ ఆంక్షల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండిగో వెల్లడించింది. ఈ మార్పులలో భాగంగా ఫిబ్రవరి 17 నుంచి డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్‌కు విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపింది.వైడ్-బాడీ విమానాల కార్యకలాపాలు ప్రస్తుతం పలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని ఇండిగో స్పష్టం చేసింది. భౌగోళిక-రాజకీయ పరిస్థితులు, తరచుగా మారుతున్న ఎయిర్‌స్పేస్ ఆంక్షలు, దేశీయంగా మరియు అంతర్జాతీయంగా విమానాశ్రయాల్లో పెరిగిన రద్దీ కారణంగా విమానాల ప్రయాణ సమయం, బ్లాక్ టైమ్ గణనీయంగా పెరిగినట్లు పేర్కొంది. ఆరు వైడ్-బాడీ విమానాలతో నడుస్తున్న 787-9 ఫ్లీట్ షెడ్యూల్‌పై ఇది తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోందని సంస్థ తెలిపింది.
ఈ నెట్‌వర్క్ సర్దుబాట్లలో భాగంగా, ఫిబ్రవరి 17 నుంచి తదుపరి నోటీసు వచ్చే వరకు కోపెన్‌హాగన్‌కు విమాన సేవలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. అలాగే ఢిల్లీ-మాంచెస్టర్ రూట్‌లో ప్రస్తుతం వారానికి ఐదు సార్లు నడుస్తున్న సేవలను ఫిబ్రవరి 7 నుంచి నాలుగు సార్లకు తగ్గించనున్నారు.



# వయసు కేవలం సంఖ్య మాత్రమే....

- ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలి
- టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ

తదుపరి ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా అనే ప్రశ్నకు దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర సమాధానం చెప్పాడు. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చని అభిప్రాయపడ్డాడు.వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, 35 ఏళ్ల వ్యక్తి 22 ఏళ్ల కుర్రాడి కంటే ఫిట్‌గా ఉంటే అతనే జట్టుకు అర్హుడని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఫిట్‌గా ఉండి, ఫామ్‌లో ఉంటే వన్డే ప్రపంచకప్ 2027 ఆడుతారని బదులిచ్చాడు. వయసును కాకుండా ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరోక్షంగా చురకలంటించాడు. 'రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027లో ఎందుకు ఆడకూడదు నా దృష్టిలో వయసు కొలమానం కాదు. ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే జట్టులో కొనసాగాలా వద్దా అనేదానికి ప్రమాణాలు. అందుకే ఎవరికీ ఎమి చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి. జట్టులో అందరినీ ఒకేలా చూడాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ సమయంలో ఎవరూ వచ్చి నాకు ఏం చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు నేను భారత్ తరఫున ఏడాది ఆడినా... మరో పదేళ్లు, 20 ఏళ్లు ఆడినా.. నా వయసు గుర్తు చేయాల్సిన అవసరం లేదు.వయసు ఏమాత్రం కొలమానం కాదు. ఫిట్‌నెస్ అత్యంత ముఖ్యం. 22 ఏళ్ల కుర్రాడు కూడా ఫిట్‌గా లేకపోతే జట్టుకు అనవసరం. విరాట్ కోహ్లీ లేదా భవిష్యత్తులో వచ్చే ఇతర ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. ఒకరికి 30 ఏళ్లు దాటాయి కాబట్టి వారు తదుపరి ప్రపంచకప్ ఆడగలరా లేదా అనే నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు ఫిట్‌గా ఉండి నిలకడగా రాణిస్తూ.. దేశంలో కోసం ఆడాలనే పట్టుదలతో ఉంటే.. వారిని ఎందుకు పక్కనపెట్టాలి. అనుభవం కలిగిన ఆటగాళ్లు ఎలా వస్తారు సచిన్ టెండూల్కర్ మినహా ఎవరూ 20 ఏళ్ల వయసులోనే అనుభవం సంపాదించలేదు. సచిన్‌లా 16-17 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ ఆడినవారు చాలా తక్కువ. అంతర్జాతీయ క్రికెట్ చాలా భిన్నమైనది. ప్రస్తుతం అనుభవం కలిగిన ఆటగాళ్లు కావాలంటే 30-33 ఏళ్ల వయసున్న వారు కావాలి. కానీ మనం 20, 25 మ్యాచ్‌లు ఆడిన వారిని అనుభవం కలిగిన ఆటగాళ్లుగా చూస్తున్నాం. ఒత్తిడిలో ఆడితేనే నిజమైన అనుభవం వస్తుంది. కేవలం మ్యాచ్‌ల సంఖ్యతో కాదు.ముఖ్యంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవారు, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసేవారికి అనుభవం చాలా ముఖ్యం. ఉత్కంఠగా సాగే మ్యాచ్‌లు ముగింపుకు వచ్చినప్పుడు వారి అనుభవం కీలక పాత్ర పోషిస్తుంది. ఒక బౌలర్‌గా నేను 10-20 సార్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాలంటే, కనీసం నేను 80-85 మ్యాచ్‌లు ఆడాలి.

## వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. 311 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 68 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. క్రీజులో ఉన్నంత సేపు అఫ్గాన్ బౌలర్లకు చెమటలు పట్టించాడు.ఎదుర్కొన్న 33 బంతుల్లోనే క్రికెట్‌లో ఉన్న షాట్స్ అన్ని ఆడాడు. తన ట్రేడ్ మార్క్ పుల్ షాట్‌తో పాటు ఫ్లిక్, కవర్ డ్రైవ్, ఆన్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. అతను కొట్టిన నాలుగు సిక్స్‌లు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను అఫ్గాన్ ఫీల్డర్ ఉజైరుల్లా నియాజై వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన అతను 24 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అనంతరం మరో రెండు బౌండరీలు, సిక్స్ బాదిన సూర్యవంశీ.. పుల్ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన ప్రధాన బలమైన పుల్ షాట్ కొన్ని సార్లు అతనికి బలహీనతగా మారుతుంది. పాకిస్థాన్‌తో జరిగిన గత సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సూర్యవంశీ పుల్ షాట్ ఆడబోయే వికెట్ పారేసు కున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ అదే తరహాలో వెనుదిరిగాడు.



## డబ్ల్యూపీఎల్ ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్



డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వడోదర వేదికగా గుజరాత్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 15.4 ఓవర్లలో ఛేదించి వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు చేరింది. ఢిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది గుజరాత్‌ను జెయింట్స్. 7 వికెట్ల కోల్పోయి 168 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభలోనే గుజరాత్‌కు పెద్ద షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సోఫీ డివైన్‌ను పెవిలియన్‌కు చేర్చింది షినెలి హెన్రీ. దీంతో సోఫీ ఆరు పరుగులకే వెనుదిరిగింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ నిలిచింది. కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని శర్మ వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేర్చింది. 9వ ఓవర్లో కనికను మిన్ను మణి వెనక్కి పంపింది. దీంతో 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేయగలిగింది గుజరాత్.అయితే వికెట్లు పోతున్నా మూనీ మాత్రం గ్రీజులో నిలిచింది. కానీ ఢిల్లీ బౌలర్ల కట్టడికి ధీటుగా ఆడలేకపోయింది. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ జోడి కుదరింది. దీంతో ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేసింది. అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో

## అండర్-19 వన్డే ప్రపంచకప్
# ఫైనల్‌కు భారత్

- అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం

అండర్-19 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతోంది. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోరులో అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలోనే ఛేదించింది.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో) సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో) అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) బాధ్యతాయుతంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను పూర్తి చేశాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులతో భారీ స్కోర్ చేసింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా (101 నాటౌట్) అద్భుత శతకాలతో భారత బౌలర్లను ఆడుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) కూడా బాగానే ఆడారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో ఏకంగా 111 పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఓపెనర్లు ఉస్మాన్ సదత్(39), ఖలిద్ అహ్మద్‌జాయ్(31) శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ జోడిని దీపేష్ దేవంద్రన్ విడదీసాడు. ఖలిద్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ ఉస్మాన్‌తో కలిసి ఫైసల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన ఉస్మాన్‌ను కాన్షిక్ చౌహన్ ఔట్ చేశాడు. దాంతో క్రీజులోకి ఉజైరుల్లా నియాజై రాగా.. ఇద్దరూ కలిసి భారత బౌలర్లను చెడుగుడు ఆడారు.ఈ క్రమంలో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫైసల్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి మరో 31 బంతుల వ్యవధిలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కాస్త నిదానంగా ఆడిన ఉజైరుల్లా నియాజై 63 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.



## వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఊచకోత

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు.అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్ మేనేజ్‌మెంట్ హింట్ ఇచ్చింది.



## పాకిస్థాన్ నీచపు బుద్దే అంత!!

- టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్దే ఈ వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు.భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు.

# అవతార్ లెవల్లో వారణాసి మూవీ

**పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదిరింది**


**ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు**

**అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం**

**అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు**



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల క్రితమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.





## తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# ఏప్రిల్ 30న పెద్ది


### కొత్త రిలీజ్ డేట్ ప్రకటన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ చిత్రాన్నిమార్చి 27న విడుదల చేయాలని భావించారు. పవన్ కల్యాణ్ కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26న వస్తున్నట్టు ఇవాళ ప్రకటించిన నేపథ్యంలో, 'పెద్ది' విడుదల తేదీని వెనక్కి జరిపినట్టు తెలుస్తోంది. అయితే, కొత్త విడుదల తేదీ మే డే వీకెండ్‌తో కలిసి వస్తుండటంతో సమ్మర్ సీజన్‌లో సినిమాకు ఇది బాగా కలిసొస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. "అతడి రాక తేదీ మారుతుంది, కానీ అతడి దృఢ సంకల్పం మారదు" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ టైటిల్ రోల్‌లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.




## చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.




## బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్




ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.

## 2026 మార్చి 26న 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబోలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల తేదీని ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో పవన్ సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనుంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విడుదల తేదీని ప్రకటించడంతో పవర్ స్టార్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. చఖదీూాఅమీ్ఘతీఎష్ట్ర2౯ష్ట్ర అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ వార్తను ట్రెండ్ చేస్తున్నారు.




Printed by SREE SESHA SAI ENTERPRISES Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY, printed at MEDCHAL MALKAJGIRI and published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY, RNI NO ; TGTEL/25/A0880, CONTACT : 94906 17666, 9490617567